# పెళ్లాం బూసమ్మ

**రా**త్తిరి బువ్వల్దిని పొండుకునే యాలయింది సలి రోజులు. ఎవురు మటుకు పొండుకోక సేసేదేంది?

బూసమ్మ మొగుడు బసవయ్య సందేల బువదిని "ఇది గిప్పుడు రానంటే!" అని ఎల్లినోడు పొండుకునే యాల సానాలెక్క మిగిలిపోయినా మల్లీ తిరిగిరాలా.

బుడ్డిదీపం ఎల్తుర్లో పక్కేసిన మంచమ్మీన, రావణాబ్బెమ్మ ఉద్యానకంలో సీతామ్మోరికి మల్లే, అటనే తలొంచు క్కూకుని ఇశారపడ్తుండది బూసమ్మ.

సందేల తలకు బోసుకుని, కల్లక్కాటిక, మొగాన సుక్క, తల్లో బంతిపూలు, సలవకోక, సలవరెయిక, యియన్నీ ఆయాల సలి ముదరక తలికే సేసి కూకుంది బూసమ్మ.

అప్పుడు పొరుగింటి లచ్మాయి ముక్కుమీన ఏలేసుకుని ఏమంది? "యియ్యాల బూసమ్మను జూత్తే యిగ బసవాయి మేం సెప్పిన మాటేం యింటాడు!" అనంది.

మరి ఎల్లిన మనిసి తిరిగి రాలా!

పొద్దుగూకినాక బసవయ్య ఇంటికొచ్చి–వొచ్చిన మనిసావజానే నిలబడిపోతే– "వుడుకు నీలు పోసుకుందువుదా" అనంది తను, నవుతా. "ఆc, నే బోసుకుంటాలే– నువ్వట నిలబళ్ళే–కోక తడుసుద్దేవో!–" అనంటంటే, ఈపు రుద్దింది తను, మెల్దిరిగిన బసవయ్యొల్ళు గెట్టిగా అదువుcతా. బువదింటా, "సుబ్బయకూతురు మాలచ్చి సందేలనే బంతిపూలు కడతంటే ఎత్తికెల్తాం సెతురాండిందనుకుండా!" అని కుశాల మీనంటే, "ఆc, ఈ బోడ్దానికి మొగుడుండాదాడ! ఆల్ల బక్కదూడ మెల్లో సుట్టటానికా దీనికి పూలూ!" అన్నాడు. ఏదీ మాలచ్చన్నట్టు, "కాత్తె మంచమ్మీన కూకో యీడ అయింది వత్తన్నాగాని" అంది, తను బువదింటం దొబుదొబున కానిత్తా. "ఆc కూకుంటాలే?" అంటా ఏందో ఎతుకుతుండాడు. "యాడికన్నా ఎల్తావెట్టా?" మొన్ననంగా కుప్పెయటం అయితే యింగా బయటి కెల్లాల్చిన పనేందీ? నిన్న రేత్తిరీ పొద్దుబొయ్యొత్తివే" అంటన్నది తను. "ఆc, అంతేనా! యిప్పుడ్రానూ" అంటా సల్లాగా ఎల్లిపొయ్యాడు బసవయ్య బూసమ్మ నిడిసి.

"గుబులు మడిసి! రానీ యియ్యాల ఏcవున్నా వుంటది" అనుకుంటా బువదిని లెగిసి, యాడ సరదాల్చినవి ఆడాడ సరిది, మంచమ్మీనకొచ్చి కూచుంది బూసమ్మ.

"రేత్తిళ్ళు బయట పనేందంటా ఈ మడ్చికి? ఆడ బజార్లో ఎవరుంటారు. ఈన్ని పలకరించటానికీ? సలిబుట్టి సత్తంటే! నిన్న రేత్తిరి యాడికెల్లాడో! కూకుని కూకుని నిదరొచ్చే. పొద్దుబొయ్యొచ్చి పొడుకుండాడు గావాల! – నిదర మయికంలో ఏం తెల్చుద్దీ – అందికే యీ మడిసింజూతే రగిలేది. యియ్యాల అట్టగాదులే."

సల్లగా తలగడకింద అద్దాందీసి సూసుకుంటా ఆలోసిత్తా పొండుకుంది...

పదాలు పాడా లనిపిచ్చింది బూసమ్మకు, లచ్మా యన్న మాటలు గెపితికొచ్చి. ఇంటికప్పుకల్లి సూసింది బూసమ్మ. యానాదోళ్ళ నాటకంలో సెంచులచ్మి అగుపించింది బూసమ్మకు. 'సెట్టులెక్కగలవా నరహరి పుట్టలెక్కగలవా నరహరి'–లెగిసి నిటారుగా కూకుంది బూసమ్మ, మంత్రకట్టుమీన లెగిసి నోరికి మల్లే...... 'నిన్న లచ్మాయి ఏమందీ?' 'తూ సిత్తకార్తి సచ్చినోళ్ళూ పొద్దువాలిందంటే చరి, సెంబుల్దీసుకు తయారుగుంటారు సోమాదికాడ' అనంది. యిమానికం రెక్కలమీన కూకున్నట్టయింది బూసమ్మకు. పానందీసి యీ మడ్చికి – ఆడకేం గుబులు మల్ల లేదు గందా.... సోమాదికాడి కెల్లావంటే కాడిరుగుద్దని నిన్న రత్తయ్య కూతుర్ని బాత్తుండాడు–ఏవిటికో!...

లెగిసి సల్లగా తలుపుదెరిసి సూసింది బూసమ్మ. ఎన్నెల తెల్లగావుంది. .... రత్తయ్యింటో సడీసప్పిళ్ళేదు... 'రత్తయ్య కూతురింటో వుండదా?'... ఎనిక్కి దిరిగి సూసింది బూసమ్మ. కాలీమంచం అగుపించింది. మళ్ళీ ముంగలకు సూసింది బూసమ్మ, శాసవిడుత్తా వూరెలపల సోమాదికాడ సెట్టుకింద దిబ్బలమీన, ఎవురో సేతులు గలిపి ఎగుర్తుండట్టు–గలక్కుమంది బూసమ్మకు–యిక ఆడగూతురు బూసమ్మ నిల్చుద్దా – యిల్లు తాలం ఎయదు, దార్లో ఒంటరాడగూతుర్ని నిలేత్తారని తెలవదు, కుక్కలు బఁయ్! మంటయ్యానిపీదు, సల్లని ఎన్నెట్లో తాసుపావుఁలు యంద్రపీత లెదురొత్తయ్యని లెక్కలేదు, – బఁయిన అలివేలు మంగతాయారుకు మల్లే ఎల్లి సోమాది దిబ్బలమీన సెట్టుకింద ఎలిసి నిలిసింది బూసమ్మ, బుసనిడుత్తా. దిబ్బమీన దిబ్బదిగువన, పొదలసాటున, పొదల లోతున, సెట్టుసాటున సెట్టమీనల, సుడిగుండాల్దిప్పి ఎదికి సూసింది బూసమ్మ, బసవయ్య కాన్రాడు. రత్తయ్య కూతురు కాన్రాదు... యిగ అటనే బూవిఁ కొరిగింది బూసమ్మ, గుండు దగిల్న దూడ బాతుకుమల్లే.

అట్టాటి సలి – వొనుకు పుట్టిచ్చుద్ది ఎవురికయినా. లెగిసి కూకుంది బూసమ్మ వొనుకుతా. తెల్లటి సేలల్లో నల్లటికుప్పలు–అఁ ఏం దదీ!

కాత్తె లెక్కనే బసవయ్య సేనూ పంటకుప్పా ఉండయి. పంటకుప్ప కెదురుంగా సేనుగెట్టుమీన ఎవురో ముసుగేసు క్కూకునుండారు.

"ఎన్నెట్లో సేలగెట్టుమీన దెయ్యాలు కూకునుంటయ్యా?"

ఆ కూకుండ యిగ్రిహం తలకాడ ఏందో సిన్నసుప్పుకు మల్లే ఎలుగుతుండది.

"ఏం దబ్బా యిదీ-!"

గాలివాల్న ఏదో తుపుక్కుమనిపిచ్చి బూసమ్మకు.

"సుట్టకాలుత్తా కూకుండాడు ఆడ ఎవుడో - ఎవుడో ఏందీ అట్ట తుబుక్కున వూసేది - పిట్టకు మల్లే లెగిసెల్లి ఇగ్రిహం ఎనకవాలిందీ బూసమ్మ - 'యిదిగో?' అంటా యిగ అట్టనే నిలబడిపోయింది మాట సాక్క.

"ఆయ్-?" మంటా పల్టీగొట్టి నిలబడ్డాడు బసవయ్య, బూసమ్మను జూసి బేజారయిపోతా.

"ఏందీ పనీ?" అడిగేసింది బూసమ్మ.

"యుద్దెం" - అన్నాడు బసవయ్య.

"చివం బెరిగిం దెట్టా?" అంది బూసమ్మ.

"దొంగలు-" అన్నాడు బసవయ్య.

"పొడిశారా?" రగిలింది బూసమ్మకు.

"గిరాకి గదంటే" సెబుతున్నాడు బసవయ్య.

"గిరాకేందీ-?" పానీలే సెపుమంది బూసమ్మ.

"వొడ్లు-" సెబుతున్నాడు బసవయ్య.

"వొడ్డేందీ?" ఏందీ సెప్పే దంది బూసమ్మ.

"యుద్దెంలో బొడ్డుకరిగే లెక్కన కూడుదింటావెట్టా-" దిబదిబ మన్నాడు బసవయ్య.

"అయితే నూ అనేదేందీ?" అంది బూసమ్మ.

"పంట మాలావు పంట పండే - కుప్ప సూద్దామనొత్తినీ-" అంటన్నాడు బసవయ్య.

"వొచ్చి ఆటనే కూకుండావేం?" అంది.

"నువొత్తావని వోదు కలగన్నాడూ!" అన్నాడు.

"ఎల్దాం పద."

"కాదన్నానా."

బూసమ్మ పెనివిఁటి బసవయతో యిల్లు సుకంగా సేరింది.